క్లుప్తంగా

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: గ్రామీణ నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని చుక్కావారి పల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన ఈఈ పద్మనాభపిళ్లై

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీని అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై ఆవిష్కరించారు. ఈఈ కార్యాలయంలో బుధవారం నాయకులు కలిసి మాట్లాడారు. అనంతరం వాటిని ఆవిష్కరించిన ఈఈ ఉద్యోగులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందరాజులు, గోవిందన్, కేబీ చంద్రశేఖర్, మధు, సురేష్ పాల్గొన్నారు.

పీఈటీకి పరామర్శ



పీఈటీని పరామర్శిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: యాదమరి మండలం 14–కండ్రిలో బుధవారం జరిగిన ఆడుదాం–ఆంధ్రా పోటీల్లో గాయపడ్డ పీఈటీ మాధవిని పలువురు అధికారులు పరామర్శించారు. చికిత్స నిమిత్తం నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఆమెను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి, డీఈఓ విజయేంద్రరావు, డీఐఓ రవిరాజు, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు ఆమెను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

పశువులకు టీకాలు



టీకాలు వేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు పాడిరైతులు వేయించుకోవాలని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. మండలంలోని 189కొత్తపల్లెలో బుధవారం ఆమె పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలను ప్రతి ఒక్కరూ పశువుకు వేయించుకోవాలన్నారు. ఈ టీకాలు వేయకపోతే పశువులు వివిధ వ్యాధులకు గురి కావచ్చని, ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తుందన్నారు. గుడిపాలలో 17వేల వరకు పాడి ఆవులు, ఎద్దులు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 31వరకు గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు వివరించారు.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యఅన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని తిరుపతికి చెందిన సుబ్రమణ్యం నాయుడు ఆలయ అధికారులకు అందించారు. ఆయన కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారులకు స్వామివారి నిత్యఅన్నదానానికి విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

నాటు తుపాకుల స్వాధీనం



తుపాకులను చూపుతున్న పోలీసులు

గుడిపాల: మండలంలోని చిత్తపార అటవీ ప్రాంతంలో ఏడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. చిత్తపార అటవీప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అటవీప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహించగా ఏడు నాటు తుపాకులు దొరికాయని ఎస్‌ఐ తెలిపారు.

సరదాగా సందడిగా.. ఆడుదాం ఆంధ్రా







పూతలపట్టు: రిబ్బన్ కట్‌చేసి క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బంగారుపాళెం: క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి, వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పూతలపట్టు: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు సరదాగా సందడిగా సాగుతున్నాయి. గ్రామీణ స్థాయి నుంచి క్రీడా కుసుమాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలను ప్రవేశపెట్టిందని మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం అధికారులు నిర్వహించారు. మొదటగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రిబ్బన్ కట్‌చేసి జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక ప్రారంభించారు. అనంతరం లాంఛనంగా మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్ క్రీడాపోటీలను ప్రారంభించారు. జెడ్పీటీసీ దేవిక మాట్లాడుతూ, ప్రతిభ ఉండి సరైన ప్రోత్సాహం లేక చాలామంది ఇప్పటివరకు వెలుగులోకి రాలేకపోయారని చెప్పారు. అలాంటివారిని గుర్తించి భవిష్యత్తులో క్రీడాకారులుగా తయారు చేయాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. మొదటి రోజున వాలీబాల్ పోటీలు నిర్వహించగా, పంచాయతీ స్థాయిలో గెలుపొందిన 32 జట్లు మండల స్థాయిలో పాల్గొన్నాయి. అందులో యం.బండపల్లి జట్టు విజేతగా నిలిచింది. మండల స్థాయి క్రీడా పోటీలకు వైఎస్సార్ సీపీ నాయకులు, మండల ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని ఎంపీడీఓ తెలిపారు.

జెడ్పీ సీఈఓ పరిశీలన

'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడాపోటీలను బుధవారం సాయంత్రం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులను పరిశీలించారు. మండల పంచాయతీ అధికారులు, సచివాలయాల సిబ్బంది తప్పక మైదానంలో ఉండాల్సిందేనని అధికారులకు సూచించారు.అనంతరం కొంత సేపు సరదాగా వాలీబాల్ ఆడారు. అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారుల జీవితంలో వెలుగు నింపే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ పొందిన క్రీడాకారులు, ప్రేక్షకులు తప్పనిసరిగా మైదానంలో పాల్గొనేలా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. క్రీడా కార్యక్రమాలను విజయవంతంగా ప్రారంభించినందుకు మండల అభివృద్ధి అధికారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, నాయకులు రాజారత్నంరెడ్డి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ రాంభూపాల్, మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్, ఎంఈఓ కృష్ణారెడ్డి, సర్పంచ్ మాసిలామణి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, నాయకులు షణ్ముగం, మణి, రాణెమ్మ, రామతులసి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, సుబ్రమణ్యం, పద్మజారాణి, నిరంజన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీడీలు కృష్ణా, డిల్లీరాణి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా..

తవణంపల్లె: మండలంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను బుధవారం స్థానిక హైస్కూల్లో ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి ప్రారంభించారు. మండలంలోని తొడతరలో వాలీబాల్, క్రికెట్ పోటీలు, అరగొండ, తవణంపల్లె హైస్కూల్లో క్రికెట్ పోటీలు, బ్యాడ్మింటన్ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. పోటీల్లో 17 సచివాలయాల్లోని జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. గురువారం అరగొండ బాలుర హైస్కూల్లో సెమీఫైనల్, ఫైనల్స్ నిర్వహిస్తామని తెలిపారు.

ఉత్సాహంగా...

బంగారుపాళెం: మండల కేంద్రంలో బుధవారం 'ఆడుదాం–ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. క్రీడాకారులు ఉత్సాహంతో పోటీలలో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రీడా పోటీలను ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి క్రీడాకారులు పాల్గొన్నారు. బంగారుపాళెం, తగ్గువారిపల్లె, నలగాంపల్లె గ్రామాల్లోని మూడు క్రీడా మైదానాల్లో పోటీలు సాగాయి. వారు మాట్లాడుతూ, క్రీడాకారులు సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఉమాదేవి, వాణీప్రియ, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ కామరాజు, సింగిల్‌విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్, సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్, ఎన్ఆర్ఐ భరత్‌రెడ్డి, కో– ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కాణిపాకంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రతిభను గుర్తించేందుకే..

ఐరాల: గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాలను, ప్రతిభను గుర్తించి వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఐరాల, కాణిపాకం, కామినాయనపల్లె, పాలకలలో క్రికెట్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో యువతి, యువకులు పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మరింత రాణించాలన్నారు. ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ఆటల్లో క్రీడా స్ఫూర్తి కూడా ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పీడీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

యాదమరి: మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలలో పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీలలో పలు జట్లు మధ్య క్రీడలు హోరాహోరీగా సాగాయి. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బోగం రెడ్డి, ఎంపీడీఓ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.









పూతలపట్టు: మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు, మైదానాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, యాదమరి: క్రీడలను ప్రారంభిస్తున్న మండల ప్రత్యేక అధికారి బోగంరెడ్డి, తవణంపల్లె: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఐరాల: స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్ నాయుడు ఆధ్వర్యంలో జన్‌భాగీదారి కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో వీం.పైపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థి సీ.రోహిత్ ప్రథమ స్థానం, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్.మహేశ్వరి, పి.సుఖిత, వక్తృత్వ పోటీల్లో పాలకల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని నవ్య ప్రథమ స్థానం, ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సీ.రోహిత్ ద్వితీయ స్థానం, ఐరాల ప్రభుత్వ ఉన్న పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.మహేశ్వరి తృతీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన ప్రథమ, ద్వితీయ స్థానాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ దామోదర్‌నాయుడు

నేడు ఫొటో ఎగ్జిబిషన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం (జన్‌భాగీదారి) కార్యక్రమంలో భాగంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొదట గురువారం ఉదయం 8.30 గంటలకు జిల్లా కేంద్రంలోని దర్గా సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు.

రూ.10 వేల ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న పార్థసారథినాయుడు

చిత్తూరు రూరల్: చిన్నారి వైద్య ఖర్చులకు దాత పార్థసారథి నాయుడు బుధవారం ఆర్థికసాయం అందించారు. కీనాటంపల్లెకు చెందిన శివకుమార్, ఝాన్సీ దంపతులరెండేళ్ల కుమార్తె హర్షితకు ఫిట్స్ కారణంగా గొంతులో పుండులా ఏర్పడింది. ఈ కారణంగా శ్వాస తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ, వేలూరు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ కుటుంబ ఆర్థిక సమస్యను తెలుసుకున్న దాత పార్థసారథి నాయుడు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల సాయం చేశారు. చిన్నారి వైద్య ఖర్చులకు సాయం చేసే దాతలు 81977 53717ను సంప్రదించాలన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీల్లో పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మికి బుధవారం వేర్వేరుగా వినతిపత్రాలు జెడ్పీ కార్యాలయంలో అందజేశారు. పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు 10 నెలలకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగరాజన్, గ్రీన్ అంబాసిడర్ యూనియన్ నాయకులు గోవిందస్వామి పాల్గొన్నారు.

పాత్రికేయులకు కానుక

చిత్తూరు రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏటా పాత్రికేయులకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సంక్రాంతి కానుకను అందించడం ఆనవాయితీగా వస్తోందని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు లోకనాథం అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన పంపించిన కొత్త దుస్తులను వైఎస్సార్ సీపీ నాయకులు కేపీ శ్రీధర్ జర్నలిస్టులకు అందజేశారు. కార్యదర్శి అశోక్, సభ్యులు పవన్, మహేష్ పాల్గొన్నారు.

ఆపస్ డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) ముద్రించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ ఆవిష్కరించారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బుధవారం విజయవాడలో మంత్రి బొత్స చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినట్లు మీడియాకు వివరించారు.

నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ

చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రజలు సహకరించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగర కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో కమిషనర్ బుధవారం ఉదయం నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రధాన రహదారులు, కూడళ్లను పరిశీలించి పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో నిర్దేశించుకున్న ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకారం అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలన్నారు. కమిషనర్ 38వ వార్డు పరిధిలో ఏఎస్ఎం వీధిలో స్థానిక కార్పొరేటర్ ఉన్ని కృష్ణన్‌తో కలిసి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. కాలువల్లో పూడిక తీశారు. చీపురు చేతపట్టి విధులను శుభ్రం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు డ్వాక్రా మహిళలు, యువత, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, మేస్త్రీలు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేస్తున్న కమిషనర్ అరుణ

సకాలంలో గ్రామీణులకు వైద్య సేవలు





గుడిపాల: సేవలందిస్తున్న వైద్య సిబ్బంది, తవణంపల్లె: వైద్యం అందిస్తున్న డాక్టర్ ప్రియాంక

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. మరకాలకుప్పం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 65 మంది రోగులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యమున, దివ్య, దేవప్రీత, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు వినయ్‌కుమార్, ప్రియాంక తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దిగువమాఘంలో ప్రియాంక, వెంగంపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్యులు 117 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

చిత్తూరు అర్బన్: అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మేయర్ ఎస్ అముద అన్నారు. జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని 39వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలను అన్ని వార్డు సచివాలయాల్లో ఘనంగా నిర్వహించారు.



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మేయర్ అముద

ఆదర్శమూర్తి అంబేడ్కర్

బంగారుపాళెం: అంబేడ్కర్ ఆదర్శమూర్తి అని ఎంపీపీ అమరావతి అన్నారు. మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత ప్రజాప్రతినిధులు జన్ భాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చుదాం అంటూ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

చిత్తూరు కలెక్టరేట్: అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా అన్నారు. ఆ కళాశాలలో బుధవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్, ప్రభుత్వ లెక్చరర్‌ల సంఘం జిల్లా అధ్యక్షురాలు హేమలత, అధ్యాపకులు రమేష్‌బాబు, షాజహాన్ పాల్గొన్నారు.





చిత్తూరు: పీసీఆర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, బంగారుపాళెం: అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఫిబ్రవరి 29లోపు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, ఇతర పెన్షనర్లు ఫిబ్రవరి 29వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్లను కచ్చితంగా అందజేయాలని జిల్లా ట్రెజరీ శాఖ డీడీ రామచంద్ర తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గాను లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పెన్షనర్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్ సర్టిఫికెట్లను నేరుగా వచ్చి అందజేయాలన్నారు. అలాగే 2023–24 సంవత్సరానికి ఇన్‌కంట్యాక్స్ రికవరీకి సేవింగ్స్ ఫారాలు, ఎంత తగ్గింపు చేయాలనే విషయాలను ఆయా సబ్‌ట్రెజరీల్లో తెలియాలని డీడీ రామచంద్ర వెల్లడించారు.

ప్రగతి పథంలో నడిపిద్దాం

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దామని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల సమావేశంలో మా ట్లాడారు. పల్లెలను అభివృద్ధి పథంలో తీసుకురావాలన్నారు. గ్రామ సభల నిర్వహణ తేదీని ప్రజలకు దండోరా ద్వారా తెలియజేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకొని పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డీపీఓ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్సీ డీసీ షణ్ముగం, పలమనేరు డీఎల్‌డీఓ ఉమావాణి, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం కోసమే సురక్ష

చిత్తూరు అర్బన్: పేదల ఆరోగ్య సంరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగర మేయర్ ఎస్ అముద, డీఎంహెచ్ఓ ప్రభావతి దేవి అన్నారు. నగరపాలక పరిధిలో బుధవారం 12, 43 వార్డు సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించారు. 43వ వార్డులో జరిగిన వైద్య శిబిరాన్ని మేయర్ అముద పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి రోగులకు జగనన్న కిట్లను, మందులను పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతితో కలిసి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. 12వ సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, స్థానిక కార్పొరేటర్లు, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.